సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



విద్యార్థుల అభ్యున్నతికి..

అధ్యాపకులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఇంటర్ విద్యా జిల్లా ప్రత్యేకాధికారి ఒడ్డెన్న అన్నారు.
- 8లో ▸



తల్లిపాలు బిడ్డకు అమృతం

తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా సంక్షేమాధికారిణి ఎస్కే రసూల్‌బీ అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.8 /23.3

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతంతోపాటు నదులు, వాగుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు ఎవరూ రాకూడదని హితవు పలికారు. చేపల వేట, ఈత సరదా కోసం చెరువులు, కాల్వలు, కుంటలు, ఇతర జలాశయాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, తక్షణ పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో ఎక్కడైనా ప్రమాదం ఎదురైనా, లేక అత్యవసర పరిస్థితులు ఏర్పడి సహాయక చర్యలు అవసరమైతే కంట్రోల్ రూం నెంబర్ 08462 – 220183కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

పరిశ్రమల్లో అధికారుల తనిఖీలు



డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న యూరియా పక్కదారి పట్టకుండా జిల్లా కేంద్రంలోని పలు పరిశ్రమల్లో డీఏవో గోవింద్ గురువారం తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమానాస్పద పరిశ్రమలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. రాయితీ యూరియాను వ్యవసాయేతర పనులకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి, ఏఈవో చక్రపాణి ఉన్నారు.

13 వరకు ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి అవకాశం

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశానికి ఈ నెల 13వ తేదీ వరకు అవకాశం ఉందని రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో అన్ని కోర్సులతోపాటు ఈ సంవత్సరం నుంచి పీజీలో బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బీఎల్ఐఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 2024–25 సంవత్సరం యూజీ, పీజీలలో అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం విద్యార్థులు రెన్యువల్ చేసుకోవడానికి ఈ నెల 13వరకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని, ఒరిజినల్ ధృవపత్రాలను సెంటర్‌లో అందజేయాలని తెలిపారు.

అవసరమైతే మరింత నీరు

- గుత్ప లిఫ్ట్ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలం ఉమ్మెడ గ్రామ శివారులోని అర్గుల రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం మొదటి పంపు వద్ద గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గుత్ప లిఫ్ట్ ద్వారా ఆర్మూర్, నందిపేట, మాక్లూర్, ఆలూర్, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాలకు చెందిన సుమారు 34,650 ఎకరాలకు నీటిని అందిస్తామని అన్నారు. ప్రస్తుతం 545 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, అవసరం మేరకు మరింత నీటిని విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీజేపీ నాయకులు భూతం సాయరెడ్డి, పటేళ్ల రాజు, చిన్నారెడ్డి, కుమ్మరి చిన్నయ్య, పెయింటర్ రాజు, లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అలీసాగర్ ఎత్తిపోతల నుంచి..

నవీపేట: మండలంలోని కోస్లీ శివారులోని అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా గురువారం ఇరిగేషన్ ఈఈ బలరామ్ సాగునీటిని విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం పరిధిలోని ఆరు మండలాల్లో 53వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కలెక్టర్ తనిఖీలు..

ఉద్యోగులు అటెన్షన్

- అన్ని మండలాల్లో అప్రమత్తం
- పెద్దసారు ఎటువైపు వెళ్తున్నారో.. ప్రతిరోజూ ఆరా తీస్తున్న ఉద్యోగులు
- కారెక్కిన తర్వాతే ఏ మండలానికి వెళ్లేది నిర్ణయిస్తున్న ఉన్నతాధికారి
- సిబ్బందితో కళకళలాడుతున్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు
- సాయంత్రం వరకు తప్పనిసరి విధుల నిర్వహణ



డొంకేశ్వర్ జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 'కలెక్టర్ సార్ ఈ రోజు ఏ మండలానికి వస్తున్నారు? మా కార్యాలయానికి వస్తున్నారా?' అంటూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ప్రతిరోజూ ఆరా తీస్తున్నారు. కలెక్టర్ పర్యటన, ఆకస్మిక తనిఖీల విషయమై ప్రతి అంశాన్ని ఉద్యోగులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఒక్కరోజు కూడా విరామం ఇవ్వకుండా ప్రతిరోజు వివిధ మండలాల్లో పర్యటిస్తూ ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. దీంతో ఉద్యోగులందరూ పూర్తిగా అటెన్షన్‌తో వ్యవహరిస్తున్నారు.

సమయపాలన పాటిస్తున్న ఉద్యోగులు

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్ర పర్యటన వివరాలు ఆయన డ్రైవర్ సహా ఎవరికీ తెలియకపోవడంతో మండల స్థాయి అధికారులు, ఉద్యోగుల్లో భయం నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రతి ఉద్యోగి కచ్చితంగా సమయపాలన పాటిస్తుండడం గమనార్హం. జూన్ 13న జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కృష్ణారెడ్డి మరుసటి రోజు 14వ తేదీ నుంచే మోపాల్ మండల పర్యటనతో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. పోస్టాఫీసులను సైతం సందర్శించి తనిఖీలు చేస్తుండడం గమనార్హం. తాను పర్యటించిన మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎరువుల గోదాములు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నారు. పీహెచ్‌సీల్లో వైద్య సేవలు, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల నిల్వలపై పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ విషయమై ప్రతి అంశాన్ని గురించి క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకుంటున్నారు.

ఉరుకులు.. పరుగులు

విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ చెప్పడంతో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, వ్యవసాయ శాఖ, రెవెన్యూ ఉద్యోగులు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. ఎక్కడైనా లోటుపాట్లు, సమస్యలు కనిపిస్తే సరిచేసుకోవాలని కలెక్టర్ సూచనలు చేస్తున్నారు. మళ్లీ 15 రోజుల్లో వస్తానని, ఆ సమయంలో సదరు సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో అధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మరోవైపు జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలోనూ కలెక్టర్ ప్రతి విషయాన్ని పిన్‌పాయింటెడ్‌గా అడుగుతున్నారు. దీంతో అధికారులు సైతం అలర్ట్‌గా ఉంటున్నారు.

అన్ని విభాగాలను చుట్టేస్తూ..

కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బయల్దేరిన సమయంలో ఏ మండలం వైపు వెళ్లే విషయాన్ని ఎవరికీ చెప్పడం లేదు. కారులో కూర్చున్న తర్వాత డ్రైవర్‌కు డైరెక్షన్ ఇస్తూ తాను ఎంపిక చేసుకున్న మండలానికి వెళ్తున్నారు. ఆయా మండలాలకు వెళ్లిన తర్వాత సైతం ఎప్పుడు ఏ కార్యాలయానికి వెళతారో, పాఠశాల, ఆస్పత్రులకు వెళతారో అనే విషయమై ఎవరికీ చెప్పకుండా ఆకస్మికంగా సందర్శిస్తున్నారు. అయితే తన పర్యటనలో మాత్రం మండలంలోని అన్ని ప్రభుత్వ విభాగాలను తనిఖీ చేస్తున్నారు. పైగా వెళ్లే దారిలోని గ్రామాల్లోనూ ఆగుతూ వివరాలు తెలుసుకుంటున్నారు. దీంతో ఉద్యోగులు కచ్చితంగా తాము విధులు నిర్వర్తించే ప్రాంతాల్లోనే ఉంటున్నారు. కలెక్టర్ ఎప్పుడు వస్తారో అనే విషయమై తెలియకపోవడంతో సాయంత్రం వరకు ఉద్యోగులు విధుల్లో ఉంటున్నారు. దీంతో అన్ని కార్యాలయాలు కళకళలాడుతున్నాయి.

2 గంటలు..6 సెంటీమీటర్లు

- నగరంలో దంచికొట్టిన వాన
- రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన వాన ఎనిమిది గంటల వరకు కురిసింది. రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అత్యధికంగా రెండు గంటల్లో 6 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారి ప్రతాప్ తెలిపారు. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు ఉప్పొంగాయి. జిల్లా కేంద్రంలోని సౌత్ మండల పరిధిలో 55.3 మి.మీ, నార్త్ మండలం 50.1 మి.మీ, ఇందల్వాయి 39.9 మి.మీ, మోపాల్ 33.0, జక్రాన్‌పల్లి 29.4, మాక్లూర్ 31.1, వేల్పూర్ 20.1, రెంజల్ 16.1, నవీపేట 15.3, పోతంగల్ 14.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 11.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.



నగరంలోని జన్మభూమి రోడ్ కాలనీలో చేరిన వర్షపు నీరు

పీహెచ్‌సీల్లోనే కాన్పులు జరగాలి

- ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలందించాలి
- డొంకేశ్వర్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీలు
- ఎంపీడీవో ఆఫీసు, పాఠశాలలు, సొసైటీ గోదాం సందర్శన

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి వైద్యాధికారులకు సూచించారు. సాధారణ చికిత్సలతోపాటు గర్భిణులకు స్థానికంగానే సుఖ ప్రసవాలు (కాన్పులు) కూడా చేయాలన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మొదట పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్... ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరును పరిశీలించారు. సేకరించిన బ్లడ్ శాంపిల్స్‌ను టీహబ్‌కు పంపిస్తున్న తీరును పరిశీలించారు. వ్యాక్సినేషన్, టీబీ ముక్త్ భారత్ అభియాన్ అమలు, గ్రామాల్లో ఆరోగ్య శిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. సుశిక్షితులైన స్టాఫ్ నర్స్ ఉన్నప్పటికీ స్థానికంగా కాన్పులు ఎందుకు చేయడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రతీ నెల కనీసం రెండు కాన్పులు స్థానికంగా జరిగేలా కృషి చేయాలన్నారు. గర్భిణులకు స్థానిక పీహెచ్‌సీలో డెలివరీ సదుపాయం అందుబాటులో ఉందని ఏఎన్ఎంలు, ఆశాల ద్వారా అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శుభాకర్‌కు సూచించారు. పీహెచ్‌సీ పనితీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని హెచ్ఎంలు సురేశ్ కుమార్, సాబేర బేగంలను ఆదేశించారు. పలువురు విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదు చేయకపోవడాన్ని గమనించి, ఎంఈవో రామకృష్ణను ఫోన్ ద్వారా కలెక్టర్ ప్రశ్నించారు. ఎఫ్ఆర్ఎస్ అమలును ఎందుకు పర్యవేక్షించడం లేదని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు – మన బడి కింద నూతనంగా నిర్మించిన తరగతి గదుల గోడలపై పెయింటింగ్స్ వేయించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ సహకార సంఘం ఎరువుల సేల్ పాయింట్‌ను సందర్శించి, అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల పనులపై స్థానిక అధికారులతో సమీక్షించారు.



ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ సందర్శన

చిన్నయానం శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి పర్యాటకులు ఈ ప్రదేశానికి వస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈ రవికి సూచించారు. బ్యాక్ వాటర్ ఏరియాలో నిలువ ఉన్న నీటిమట్టం, గోదావరి ప్రవాహాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాక్ వాటర్ ఏరియాను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దే ప్రతిపాదనలను అడిగి తెలుసుకొని, అందుకు అనుకూలంగా ఉన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

పంటను ధ్వంసం చేయడమెందుకు?

- ఫారెస్టు అధికారులను ప్రశ్నించిన సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్‌రావు
- గిరిజనులతో కలిసి భూమి పరిశీలన



మోతీరామ్‌నాయక్ తండాలో వివరాలు తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్‌రావు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): చేతికొచ్చిన మొక్కజొన్న పంటకు గడ్డి మందు కొట్టి ధ్వంసం చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ఫారెస్ట్ అధికారులను జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్‌రావు ప్రశ్నించారు. మోపాల్ మండలం భైరాపూర్ మోతీరామ్‌నాయక్ తండాలో గురువారం సాయంత్రం అటవీ అధికారులు గడ్డి మందు కొట్టిన మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. మొక్కజొన్నకు గడ్డిమందు కొట్టడంతో మనస్తాపానికి గురైన రైతు ప్రకాశ్ నాయక్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైతు ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు, వాస్తవ పరిస్థితులు, భూముల వివరాలను గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్ భూముల వివరాలను సంబంధిత అధికారుల వద్ద వాకబు చేశారు. మొక్కజొన్న పంట సాగు చేసి రెండున్నర నెలలు గడిచిపోయిందని, చేతికొచ్చే పంటకు గడ్డి మందు కొట్టి ధ్వంసం చేశారని, దీంతో రూ.లక్షకు పైన నష్టం వాటిల్లిందని గిరిజనులు వివరించారు. కాగా, ఆత్మహత్యాయత్నంతో అధికారులను బెదిరించే ప్రయత్నం చేసిన రైతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. అటవీ భూమిలో ప్రకాశ్ అక్రమంగా సాగు చేయడంతోనే తాము అడ్డుకున్నట్లు ఫారెస్ట్ అధికారులు వివరించారు. అన్ని వర్గాల నుంచి విషయ సేకరణ చేసిన జడ్జి ఉదయ్ భాస్కర్‌రావు పలు విలువైన సూచనలు చేశారు. చట్టం అందరికీ ఒకేలా ఉంటుందని, చట్టానికి బాధ్యులుగా ఉండాలన్నారు. రైతు ప్రకాశ్‌పై నమోదైన కేసును సామరస్యంగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. జడ్జి వెంట న్యాయవాదులు ఆశ నారాయణ, బాల్‌రాజ్ నాయక్, రవిప్రసాద్, న్యాయసేవా సంస్థ సూపరింటెండెంట్ శైలజ, సెక్షన్ ఆఫీసర్ బాసిత్, ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు చవాన్ మోహన్ నాయక్, సేవాలాల్ సేన ప్రధాన కార్యదర్శి నరేశ్ నాయక్, ఇందల్ నాయక్, జలందర్, గౌతమ్, జవహర్‌లాల్ తదితరులు ఉన్నారు.

ఎస్సారెస్పీ నీటి విడుదల ప్రారంభం

- నాలుగు తడులకు నీటి సరఫరా
- 30 టీఎంసీలు కేటాయింపు
- స్విచ్ ఆన్ చేసిన అన్వేష్ రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



కాకతీయ కాలువకు నీటి విడుదల ప్రారంభిస్తున్న అన్వేష్‌రెడ్డి, ఎస్ఈ, ఈఈ తదితరులు



సరస్వతి కాలువకు నీటి విడుదల ప్రారంభిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయం నుంచి ప్రాజెక్ట్ అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి విడుదలను గురువారం ప్రారంభించారు. కాకతీయ కాలువ ద్వారా జోన్–1 కోసం (డీ–53 వరకు) 3,500 క్యూసెక్కులు, మిడ్‌మానేరు కోసం వరద కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 150 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టారు. కాకతీయ కాలువ ద్వారా జోన్–1 వరకు మాత్రమే ప్రస్తుతం నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 40.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందన్నారు. అందులో 5 టీఎంసీలు డెడ్‌స్టోరేజీ, 5 టీఎంసీలు తాగునీటి అవసరాలకు కేటాయించగా 30 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించేలా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. నాలుగు తడులుగా విభజించి నీటి విడుదల చేపడుతామన్నారు. జోన్–1, 2ల కోసం వారబందీ అమలు చేస్తూ నీటి విడుదల చేయాలని ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఆధారంగా నీటి విడుదల జరుగుతుందని వివరించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సారెస్పీ ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేష్‌రెడ్డి అన్నారు. నీటి విడుదల అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత సంవత్సరం వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, దీంతో ప్రాజెక్ట్‌లోకి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నీరు రాలేదన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నీటి విడుదలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ చక్రపాణి, పీఏసీఎస్ చైర్మన్‌జక్క రవి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి రవి, డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు సంతోష్, మాజీ సర్పంచ్ కట్కం రమేశ్, సుమో రాజేశ్వర్, ఆకుల పెద్ద రాజన్న, నాగంపేట్ గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

సరస్వతి కాలువకు నీటి విడుదల చేసిన ఎమ్మెల్యే

ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నీటి విడుదల చేపట్టారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

విద్యుదుత్పత్తి ప్రారంభం

ఎస్సారెస్పీ వద్ద ఉన్న జల విద్యుదుత్పత్తి కేంద్రంలో జెన్‌కో ఎస్ఈ రమేశ్ విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కుల నీటిని వదలడంతో ఒక్క టర్బాయిన్ ద్వారా 7 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్ తెలిపారు.

గతేడాదీ ఆగస్టు 7నే..

గతేడాది ఖరీఫ్ పంటల కోసం కాలువల ద్వారా ఆగస్టు 7నే ప్రాజెక్ట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నీటి విడుదలను చేపట్టారు. ప్రస్తుత సంవత్సరం కూడా అదే తేదీన నీటి విడుదల ప్రారంభించడం యాదృచ్ఛికంగా జరిగింది. కాగా, గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 47 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ప్రస్తుతం 40.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రైతులకు సరిపడా యూరియా



మాట్లాడుతున్న కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సభ్యులు

- అన్నదాతల సమస్యల పరిష్కారానికి కమిషన్ పని చేస్తుంది..
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్

సుభాష్‌నగర్: జిల్లాలోని రైతాంగానికి సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎక్కడా కొరత లేదని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పేర్కొన్నారు. నగరంలోని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశపు హాల్లో వ్యవసాయ, హార్టికల్చర్, మార్కెటింగ్ శాఖల పనితీరు, పథకాల అమలు, సబ్సిడీలు, తదితర అంశాలపై గురువారం ఆయన సమీక్షించారు. ప్రధానంగా వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో రైతాంగానికి కల్పిస్తున్న రాయితీలు, పంటల విస్తీర్ణం, ఎరువుల నిల్వలపై డీఏవో గోవిందు, జేడీ శ్రీనివాస్‌రావును అడిగారు. 10వేలకు పైగా ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తేనే జిల్లాకు ఫ్యాక్టరీ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై రైతులకు దాని ప్రయోజనాలను వివరించాలన్నారు. జిల్లాలో పసుపు సాగు స్వల్పంగా పెరిగిందని అధికారులు వివరించారు. యూరియా కొరత లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని గడుగు గంగాధర్ సూచించారు.

యేటా టెండర్లు నిర్వహించాలి..

మార్కెట్ కమిటీల్లో సెక్యూరిటీ టెండర్లు ప్రతియేటా నిర్వహించాలని గడుగు గంగాధర్ ఆదేశించారు. ఏళ్లుగా ఒక్క కాంట్రాక్టర్‌కే అప్పగించడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు దళారుల ప్రమేయం లేకుండా గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీలో ఉద్యోగులు, సిబ్బంది కొరత, డిప్యుటేషన్ల వివరాలతోపాటు ఆదాయం, ఖర్చులు, గోదాములు తదితర అంశాలను సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణ వివరించారు. ఉద్యోగుల కొరత, హోల్‌సేల్ మార్కెట్‌లో కొత్త లైసెన్సులు, మడిగెల నిర్మాణం తదితర అంశాలపై ఇప్పటికే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి వివరించారు. అనంతరం దడువాయిలు, హమాలీలు, చాటా కార్మికులు గడుగు గంగాధర్‌ను కలిసి సమస్యలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి గంగు, ఏడీఏ కృష్ణ, డైరెక్టర్లు మారుతీ మల్లేశ్, గంగారెడ్డి, రాజలింగం, బాగారెడ్డి, దేవ కరుణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లా హాకీ జట్టుకు అభినందన



సుభాష్‌నగర్: ఇటీవల జరిగిన రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల హాకీ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబర్చి ద్వితీయ స్థానం సాధించారు. ఈసందర్భంగా జిల్లా జట్టుకు గురువారం ఎస్‌ఈ రవీందర్ అభినందనలు తెలియజేశారు. నగరంలోని విద్యుత్ ప్రగతి భవన్‌లో జట్టు సభ్యులకు పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం జట్టు సభ్యులు ట్రోఫీని ఎస్‌ఈకి అందజేశారు. స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుడు తోట రాజశేఖర్, ఉద్యోగులు గంగారాం, మన్మోహన్, పోశెట్టి, బి సురేష్, చెన్నయ్య, సురేష్, జేఏఓలు ఆలీ గోపి, ఉత్తమ్‌సింగ్, దినేష్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

'జనని' పుస్తకావిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎంకాం ఈ–కామర్స్ విద్యార్థిని రామగిరి గంగోత్రి రచించిన హారర్ అండ్ క్రైమ్ ఫిక్షన్ 'జనని' పుస్తకాన్ని గురువారం రిజిస్ట్రార్ యాదగిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో రచన వైపు మళ్లిన విద్యార్థిని గంగోత్రి అభినందనీయురాలన్నారు. భవిష్యత్‌లో సమాజ హిత రచనాకాంక్షను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం గంగోత్రిని సత్కరించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్, ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, పీఆర్‌వో పున్నయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 2,153 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 150 క్యూసెక్కులు, అలీ సాగర్ లిఫ్ట్ ద్వారా 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 462 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1078.30 (40.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.



దుబ్బ–ఖానాపూర్ రోడ్డులో కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న నీరు



ఆదర్శనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



గౌతమ్‌నగర్‌లో..

నగరంలో కుండపోత

నిజామాబాద్ నగరంలో గురువారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. దీంతో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు చెరువులను తలపించాయి. నగరంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు భారీగా నిలిచిఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దుబ్బ నుంచి ఖానాపూర్‌కు వెళ్లే దారిలో, ఆదర్శనగర్, గౌతమ్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, జన్మభూమిరోడ్డులోని పలు కాలనీలు, రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే దారిల్లో రోడ్లపై వర్షపునీరు, మురికినీరు నిలిచాయి. అరుంధతినగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



నగరంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపునీరు



చెరువును తలపిస్తున్న శంకర్ భవన్ పాఠశాల



ఎన్జీవోస్ కాలనీలో..



రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే దారిలో..

రూరల్ మండలంలో..

నిజామాబాద్ రూరల్: మండలంలో గురువారం ఉదయం వర్షం దంచి కొట్టింది. ఉదయం ఆరు గంటలకు ప్రారంభమై దాదాపు గంటపాటు ఆగకుండా కురిసింది. వర్షాలు లేక వారం రోజులుగా సతమతమవుతున్న ప్రజలు, వ్యవసాయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుండారంలో కురుస్తున్న వర్షం

లోతట్టు ప్రాంతాల పరిశీలన



నిజామాబాద్ సిటీ : నగరంలోని లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ గురువారం ఉదయం మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. గౌతంనగర్, ఎల్లమ్మగుట్ట, పులాంగ్ వాగు, చంద్రశేఖర్ కాలనీ, సీఎం రోడ్డు, బంగారు మైసమ్మ కాలనీల్లో పూడికతీత పనుల పురోగతిని మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డీఈ ముస్తాక్ అహ్మద్, సుదర్శన్‌రెడ్డి, ఏఈలు ఇనాయత్ కరీం, రషీద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ షాదుల్లా తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన రూరల్ ఎమ్మెల్యే

మోపాల్(నిజామాబాద్‌రూరల్): సీఎం రేవంత్ రెడ్డిని గురువారం ఢిల్లీలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్, నిర్మల్ జిల్లా పరిశీలకులు బాడ్సి శేఖర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై సీఎంతో వారు చర్చించారు. అలాగే జిల్లా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



వరలక్ష్మి.. వరప్రదాయినీ

- నేడు వరలక్ష్మి వ్రతం
- శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున నిర్వహణ

నిజామాబాద్ రూరల్: శ్రావణ మాసంలో వరలక్ష్మి మాతను మహిళలు ప్రత్యేకంగా కొలుస్తుంటారు. ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈరోజున వరలక్ష్మి అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని, వ్రతం ఆచరించేవారు ఉపవాస దీక్ష పాటించడం శ్రేష్ఠమని పండితులు చెబుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మహిళలు నేడు వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఈరోజు మహిళలు ఉదయాన్నే లేచి ఇల్లంతా శుభ్రపరుచుకుని, ముగ్గులు తోరణాలు పెట్టి శోభాయమానంగా అలంకరిస్తారు. ధనధాన్య, విద్యా, వైద్య, సంతాన, అష్టలక్ష్మిలను పూజించిన ఫలితము ఈ ఒక్క వరలక్ష్మి వ్రతం నాడు అమ్మవారిని పూజించడంతో దక్కుతుందని పండితులు పేర్కొంటున్నారు.

పూజా విధానం..

ఇత్తడి, రాగి, వెండి, బంగారు చెంబులో కొబ్బరి కాయతో కలశ రూపంలో అమ్మవారిని పూజిస్తారు. కొందరు మహిళలు అమ్మవారిని ప్రార్థించి పాలు తేనె నెయ్యి వంటి వాటితో అభిషేకం నిర్వహిస్తారు. అమ్మవారికి చీరలు, రవికలు పండ్లు బెల్లం నెయ్యితో తయారుచేసిన నైవేద్యాలతో సమర్పించి యధాశక్తిగా పూజిస్తారు. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మహిళలయితే బిందెలకు చీరలను కట్టి పూలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా అమ్మవారిని పూజిస్తారు. వ్రతం చేసేటప్పుడు గోత్రనామాలతో సంకల్పం చేసుకుంటారు. అలాగే కలశ పూజ, గణపతి, గౌరీ పూజలను సైతం నిర్వహిస్తారు. లక్ష్మీదేవిని పంచామృతాలతో అభిషేకించి, అమ్మవారి నామాలతో, తామర పువ్వులతో పుష్పార్చన కుంకుమార్చన పూజలు నిర్వహించడం శ్రేష్ఠమని పండితులు విశ్లేషిస్తున్నారు. వ్రతం అనంతరం ముత్తయిదువులకు వాయినాలు ఇవ్వడం వల్ల పదికాలాలపాటు అష్టైశ్వర్యాలతో సౌభాగ్యాలతో ఉంటారని భక్తుల నమ్మకం.



ఆలయాలు ముస్తాబు..

నగరంలోని దేవిరోడ్‌లోగల దేవీమాతా ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, లలితాదేవి ఆశ్రమాలయం, దుబ్బ మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు.

ప్రోత్సహించే వారుంటే కాదేది అసాధ్యం

- రన్నింగ్ పోటీల్లో రాణిస్తున్న ఖానాపూర్ వాసి అజయ్‌కుమార్

నిజామాబాద్ రూరల్: 'శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది' అన్న స్వామి వివేకానంద మాటలు గుర్తుంచుకున్న ఖానాపూర్ వాసి గరిపల్లి అజయ్‌కుమార్ నేషనల్ అథ్లెటిక్ పరుగు పందెంలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన అజయ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. తాత–నానమ్మ వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. తాత అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమయ్యాడు. అయినా కుంగిపోకుండా తన కంటు జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు. పరుగు పందెంలో చిన్ననాటి నుంచే ఆసక్తి ఉన్న అతనికి కుటుంబ సభ్యులు అండగా నిలిచారు. అంతేకాకుండా గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు ఇచ్చిన ప్రోత్సాహంతో పోటీల్లో రాణిస్తున్నాడు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్ పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి మెడల్ సాధించాడు. అదేవిధంగా గత నెల 19న పంజాబ్, బిహార్ లో నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్ కాంపిటేషన్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో రాణించాడు. అంతకుముందు చెన్నైలో జరిగిన నేషనల్ కాంపిటేషన్‌లో సైతం ప్రతిభ కనబర్చాడు. తనకు ఆర్థికంగా, ఆత్మస్థైర్యాన్ని నింపిన వారిని జీవితాంతం గుర్తుపెట్టుకుని ఇతరులకు ఆదర్శంగా నిలుస్తానని అజయ్ కుమార్ అంటున్నాడు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడిపోయిన వారు మళ్లీ ఆత్మస్థైర్యంతో గెలవడానికి ప్రయత్నించాలని విద్యార్థులకు, తోటి యువకులకు అతడు తెలుపుతున్నాడు.



ఖానాపూర్‌లోని తాతయ్య–నానమ్మలతో అజయ్ కుమార్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఖలీల్‌వాడి: నగర పరిధిలోని జానకంపేట గ్రామ శివారులో ఉన్న అశోక్ సాగర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు తెలిపారు. చెరువులో గురువారం ఉదయం మృతదేహం పైకి తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటాయని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు ఆరో టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

పార్థి దొంగల ముఠా సభ్యుడి అరెస్టు

కామారెడ్డి క్రైం: జాతీయ రహదారుల వెంబడి ఆగి ఉన్న వాహనాలను టార్గెట్ చేస్తూ దారి దోపిడీలకు పాల్పడడంతోపాటు ఆయా జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న పార్థి దొంగల ముఠా సభ్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముధ్కేడ్ ప్రాంతానికి చెందిన ముఠాలోని ముగ్గురిని కొంతకాలం క్రితం కామారెడ్డి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో జాతీయ రహదారులపై జరుగుతున్న దారి దోపిడీలు, రోడ్డుకు సమీపంలోని ఇళ్లలో దొంగతనాలకు సంబంధించిన కేసులు ఈ ముఠాపై నమోదై ఉన్నాయి. జిల్లాలోని గాంధారి, పిట్లం, బీర్కూర్, సదాశివనగర్, మద్నూర్, తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లలో పార్థి ముఠాపై కేసులున్నాయి. పోలీసులు ముగ్గురు సభ్యులతోపాటు ఓ రిసీవర్‌ను అరెస్టు చేసినప్పటికీ.. ప్రధాన సభ్యుడు భాస్కర్ బాపూరావు చౌహాన్ ఎనిమిది నెలలుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నిందితుడి కోసం చాలా రోజులుగా గాలిస్తున్నాయి. అతడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐలు శ్రీనివాస్, సంతోష్‌కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, రంజిత్, ఉస్మాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది గణపతి, శ్రీనివాస్, రాజేందర్, శ్రావణ్, లక్ష్మీకాంత్, స్వామి, మైసయ్య, రవిని ఎస్పీ అభినందించారు.

క్రైం కార్నర్

బోర్లం క్యాంపులో ఒకరి ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపు గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. బోర్లం గ్రామానికి చెందిన పటేల్ నిర్మల (45)కు బీర్కూర్ మండలం చించోలి గ్రామానికి చెందిన పటేల్ శ్రీనివాస్‌తో 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా గత 15 సంవత్సరాలుగా భర్త దూరంగా ఉంటున్నాడు. ఇటీవల పెద్దకూతురుకు నిర్మల వివాహం జరిపించింది. కానీ రెండో కూతురు పెళ్లి ఎలా చేయాలంటూ బాధపడుతుండేది. దీంతో జీవితంపై విరక్తి చెంది నిర్మల బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి పెద్దకూతురు సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

రెంజల్(బోధన్): ఒకరిపై దాడికి పాల్పడిన ఘటనలో మండలంలోని వీరన్నగుట్ట తండా గ్రామానికి చెందిన జాదవ్ రాజుతోపాటు అతడి మిత్రుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ గురువారం తెలిపారు. వీరన్నగుట్ట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన వీరయ్య నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు బుధవారం అర్ధరాత్రి విధులు నిర్వహిస్తుండగా రాజుతోపాటు అతని స్నేహితుడు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో వీరయ్య వారిని ఈ సమయంలో ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించగా, వారు అతడిపై దాడి చేశారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మోపాల్ మండలంలో ముగ్గురిపై..

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామంలో మహిళపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు. గ్రామానికి చెందిన కొత్తోళ్ల రాధాతో మోహన్, లక్ష్మి, అనితకు పాత గొడవలు ఉన్నాయి. ఈక్రమంలో రాధకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోకి గురువారం వారు వచ్చి అకారణంగా దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 24మంది అరెస్టు

మద్నూర్(జుక్కల్): మండలంలోని రెండు పేకాట స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం రావడంతో బిచ్కుంద సీఐ రవికుమార్, మద్నూర్ ఎస్సై విజయ్ కొండ ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై దాడులు చేసి, పేకాడుతున్న 24 మందిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 34వేల నగదు, 19 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిలో డోంగ్లీ మండలం మదన్‌హిప్పర్గాలో 20 మందిని, మద్నూర్ మండలం పెద్ద శక్కర్గాలో నలుగురిని పట్టుకున్నట్లు వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

బోధన్‌రూరల్: మండలంలోని పెంటాకుర్దు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దొబ్బ మారుబాయి (105) గురువారం మృతిచెందింది. గ్రామానికి చెందిన ఆమె గ్రామంలో గర్భిణులకు నార్మల్ డెలివరీలు చేయడంతో పేరుపొందింది. గత 75 ఏళ్లల్లో గ్రామంలో సుమారు వెయ్యికి పైగా ప్రసవాలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామపెద్దలు, గ్రామస్తులు మారుబాయి మృతదేహానికి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



మారుబాయి (ఫైల్)

ఇసుక డంపు స్వాధీనం

రుద్రూర్: పోతంగల్ మండలం కల్లూర్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను గురువారం తహసీల్దార్ గంగాధర్ స్వాధీనం చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించిన ఇసుకను కొందరు అక్రమంగా డంప్ చేసినట్లు గుర్తించారు. ఈ ఇసుకను వర్ని మండలం చింతల్‌పేట్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించినట్లు ఆయన తెలిపారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- డబుల్ బెడ్‌రూం ఇళ్లు, అసంపూర్తి పనులపై అధికారులతో సమీక్ష

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను, ఇతర అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో గురువారం ఆయన అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి విద్యుత్, మున్సిపల్ అధికారులు, ఆర్అండ్‌బీ, హౌసింగ్, పంచాయతీ రాజ్ తదితర శాఖల ఇంజినీరింగ్ అధికారులతో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్బన్ ఏరియాల్లో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీజీహెచ్‌లో మరమ్మతులు కూడా వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. పనులపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): అధిక దిగుబడి, మంచి మద్దతు ధరతో గణనీయమైన లాభాలను అందించే ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు జిల్లాలోని ఆదర్శ రైతులు ముందుకు రావాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సందర్భంగా, సహకార సంఘం ఎరువుల గోడౌన్ వద్ద స్థానిక రైతులతో భేటీ అయ్యారు. ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన నూత్‌పల్లి గ్రామ ఆదర్శ రైతు గోపిడి గంగారెడ్డి కలెక్టర్ సమక్షంలో తన స్వీయ అనుభవా లను తోటి రైతులకు తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గంగారెడ్డిని అభినందించారు. ఇతర రైతులు కూడా ఇదే స్ఫూర్తితో ఆయిల్‌పామ్ సాగును చేపట్టి ఆర్థిక పరిపుష్టి సాధించాల ని అన్నారు. ఈ పంట సాగుకు జిల్లాలో అనుకూ ల పరిస్థితులు ఉన్నాయని, ప్రభుత్వం పెద్ద ఎత్తు న రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. సాగుకు ముందుకు వచ్చే రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామన్నారు.



డొంకేశ్వర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివి

- జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ
- ముగిసిన తల్లి పాల వారోత్సవాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా సంక్షేమాధికారిణి ఎస్‌కే రసూల్‌బీ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో గురువారం వారం రోజులుగా కొనసాగుతున్న తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, ఇందల్వాయి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ క్రిస్టినా, పిల్లల డాక్టర్ దీపక్‌రాథోడ్ మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పలువురు పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి, హెచ్ఈవో శంకర్, ఆయుష్ డాక్టర్ మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుజ్జి, మమత, శోభ, సరిత, వరలక్ష్మి, సునీత, భాగ్యలక్ష్మి, రాధాలక్ష్మి, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ రాంబాబు, ఐటీ ప్రకాశ్, బ్లాక్ కోఆర్డినేటర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ

బీజేపీతోనే సామాజిక న్యాయం



సుభాష్‌నగర్: అన్ని వర్గాల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని, సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ఇచ్చి, రిజర్వేషన్లు మైనారిటీలకు అమలుచేయడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ బీసీల కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. రాష్ట్ర పార్టీ సూచన మేరకు ఈనెల 15 వరకూ జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. నాయకులు లక్ష్మీనారాయణ, గంగాధర్, శ్రీనివాస్, ఆశన్న, నారాయణ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాంచందర్, శంకర్, సంతోష్,ముత్యాలు, మల్లేష్ ఉన్నారు.


విద్యార్థుల అభ్యున్నతికి సమన్వయంతో పనిచేయాలి

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల అభ్యున్నతి కోసం అధ్యాపకులు సమన్వయంతో పనిచేసి, మంచి ఫలితాలను సాధించాలని ఇంటర్ విద్యా జిల్లా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఒడ్డెన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాల్సిందేనని అన్నారు. కళాశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున యూనిట్ టెస్టులు నిర్వహించి మార్కుల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారు చదువుకునే విధంగా ఆసక్తి కలిగించాలని సూచించారు. విద్యార్థులు కళాశాలకు హాజరుకాకుంటే వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందజేసే ప్రక్రియను ప్రయోగాత్మకంగా నిజామాబాద్ నుంచి ప్రారంభించాలన్నారు. నిజామాబాద్ బాలికల జూనియర్ కళాశాల రాష్ట్రంలోనే మోడల్ జూనియర్ కళాశాలగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కళాశాల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. జిల్లా ఇంటర్ అధికారి రవికుమార్ తదితరులు ఉన్నారు.



బాలికల కళాశాలను తనిఖీ చేస్తున్న అధికారులు

తెలుగులో బాలామణికి డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ తెలుగు విభాగం పరిశోధక విద్యార్థిని బాలామణి పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ తెలుగు విభాగం అధ్యాపకులు సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి పర్యవేక్షణలో 'ముదిగొండ వీరభద్రయ్య సాహిత్య విమర్శ– సమగ్ర పరిశీలన' అనే అంశంపై బాలామణి పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వారిజారాణి గురువారం తెయూలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా హాజరై, పరిశోధకురాలిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.